


"విశ్వావసు" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
30 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం విజేత

# నల్లమల్లె చెట్టు

- గౌతమ్ లింగా (Johannesburg, South Africa)

"అవును నాకు పిల్లల్లేరు, ఎంతమంది ఎన్ని రకాలుగా అడిగినా ఇదే నా సమాధానం, పెళ్ళయి పదిహేనేళ్లయింది అయినా పిల్లలు పుట్టలేదు, ఎన్ని వందలసార్లు వందలమందికి చెప్పానో, అయ్యోపాపంలు నాకొద్దు, మీరు కురిపించే సానుభూతీ నాకొద్దు, పిల్లలు పుట్టకపోవడంలో నా తప్పు ఉందేమో తెలియదు కానీ నేను ఏ తప్పూ చేయలేదు, మీ చూపుల్లో నన్ను దోషిని చేయకండి, మీ మాటల్లో నన్ను నిందించకండి" అని గట్టిగా అరచి చెప్పాలని చాలాసార్లు అనిపించింది. దాదాపు ఇలాగే చెప్పిన సందర్భాలూ ఉన్నాయి, తరువాత బాధపడ్డవీ ఉన్నాయి, చెప్పలేకపోయి తరువాత మొఖంమీద మొహమాటం లేకుండా చెప్పాల్సింది అని మధనపడ్డవీ ఉన్నాయి, సందర్భమేదైనా రోజులో ఎప్పుడో అప్పుడు నాకు పిల్లలు లేరని సమాజం గుర్తుచేస్తూనే ఉంది, నేను మర్చిపోతానేమోనని వాళ్ళకి భయం. అందుకే అన్నిసార్లు గుర్తుచేసేది. నేను అందరిలాగే ఆనందంగానే ఉన్నాను, ఏదో ఒక చిన్న లోటు అంతే. బాధపడేంత, కృంగిపోయేంత కాదని నా వాదన, ఆ వాదన కూడా నాకు నాతోటే, ఒక్క కొడుకో కూతురో ఉంటే బాగుండేది అనేవాళ్ళు కొందరు, మీరుపోయాక ఈ ఆస్తంతా ఎవరు తింటారో అనేవాళ్ళు ఇంకొందరు, అయినా మీదే బాగుంది ఈ పిల్లలతో చస్తున్నాం అని బాధపెట్టేవాళ్ళు మరికొందరు. అయినా నేను బాధపడడం ఎప్పుడో మర్చిపోయా, కొన్నిరోజులు ఒక కుక్క పెంచుకున్నా, అదేటో వెళ్ళిపోయింది, రామచిలకని పెంచుకుంటే తిండి పడక చనిపోయింది. అదేంటో నాకు వాటిని చూసుకోవడం రాలేదు, నాకు పిల్లలు లేరుగా.

నేనూ మా ఆయనా, ఇద్దరమే ఇంట్లో. ఆయనకీ ఇలాంటి అనుభవాలు ఉన్నాయేమో తెలియదు, నాకెప్పుడూ చెప్పలేదు, గత పది సంవత్సరాలలో ఒక్కటంటే ఒక్కసారికూడా మేము దానిగురించి మాట్లాడుకోలేదు, మా మటుకు మేము సంతోషంగానే ఉన్నాం. దానికి మేము అప్పుడప్పుడూ పడే గొడవలే సాక్ష్యం. పిల్లలు లేరనేనేమో ఆయన నన్ను మరింత ప్రేమగా చూస్తాడు.

మొదట్లో మేము ఇండియాలో ఉద్యోగాలు చేసుకునేవాళ్లం, అప్పుడు పిల్లలు లేరని గుర్తించి గుర్తుచేసేవాళ్లూ, ఒక్కరో ఇద్దరో అర్జెంటుగా కావాలని దబాయించేవాళ్లూ, వాళ్ళ చుట్టాల్లోనో స్నేహితుల్లోనో వాళ్లెవరికో కూడా మాలాగే పిల్లలు పుట్టలేదనీ అదేమీ పెద్ద సమస్య కాదనీ ఓదార్చేవాళ్లు, అదేదో గుడికెళ్తే దారిలో వాంతులూ ఇంటికి చేరే సరికే కవలపిల్లలు పుడతారని చెప్పేవాళ్ళు ఉండేవారు, అవన్నీ తప్పించుకొని ఉద్యోగదారుల్లో పది సంవత్సరాలుగా దక్షిణాఫ్రికా దేశంలో వచ్చిపడ్డాం, ఇక్కడ ఆ తాకిడి కొంత తక్కువ, స్థానికులతో అస్సలు సమస్యలేదు, ఇప్పటికీ నవ్వుతూ హాస్పిటల్స్ లో ప్రయత్నాలేమీ చెయ్యలేదా, కొత్త టెక్నాలజీ ఏదో వచ్చినట్టుంది అని సలహాలయ్యే తెలుగు వారు కొందరు ఎదురుపడతారు, నవ్వుతూ చేశామండీ అని చెప్పడమో, తెలుసుకుంటామండీ అని తప్పించుకోవడమో చేస్తుంటా, చాలాసార్లు మొదటి పరిచయంలోనే నేనే చెప్పేస్తా, అది నాకు సుఖం. వాళ్ళ డొంక తిరుగుడు ప్రశ్నలు చాలావరకు తప్పించుకోవచ్చు. నిజంగానే ఎన్నో ప్రయత్నాలు చేసాం, మనసుకీ దేహానికీ వేల సూదుల్ని గుచ్చుకొని, ఓర్చుకొని, చివరకి నాకు నేనే మిగిలిన జీవితం నాది, నాకు ఇది నచ్చింది. ఏదీ మిగిల్చుకోకుండా వెళ్లిపోవచ్చు. సంపూర్ణంగా గుండు సున్నాలాగా నాకునేనే బ్రతకొచ్చు, గుండుసున్నా లాగా ఏమీ కాకుండా ఏదీ లేకుండా వెళ్ళిపోనూవచ్చు. ఇందులో బాధా ఉంది, సంతోషమూ ఉంది. పిల్లలు మాత్రమే లేనిది.

దక్షిణాఫ్రికాలో మాది సుఖమైన జీవితం, ఇద్దరికీ మంచి ఉద్యోగాలు మంచి జీతాలు రెండేళ్లకోసారి ఇండియా వెళ్లి వస్తుంటాం, అప్పుడప్పుడు ఏదైనా దేశానికి వెళ్లి ఓ పదిరోజులు ఉండి వస్తుంటాం, ఇన్నేళ్ళుగా ఇక్కడ ఉంటున్నా బయటకెళ్ళి నలుగురితో కలిసి ఫంక్షన్లలో పండగల్లో పాల్గొనే సందర్భాలు చాలా తక్కువ, ఎందుకో నాకు నచ్చలేదు, నాలో ఉన్న ఆత్మన్యూనత ప్రధానకారణం కావచ్చు, ఇంకేదైనా కావచ్చు. ఎవరైనా పిలిచినా ఖచ్చితంగా వస్తానని చెప్పి వెళ్ళకపోవడం నేను ఎప్పుడూ చేసే పని. పండుగలన్నీ ఇంట్లో మేమిద్దరమే చేసుకుంటాం. కొన్ని రోజుల తరువాత ఈ ప్రపంచంలో అసలు మేమిద్దరమే ఉన్నామేమో అనిపించేది. మంచి కారు ఉంది ఎప్పుడైనా డ్రైవ్ కి వెళ్తుంటాం, అన్నీ ఉన్నాయనిపిస్తోంది. ఆనందంగా ఉన్నామనిపిస్తోంది, లేవేమో అనికూడా అనిపిస్తుంది.

ఒక నెల రోజుల క్రితం మా ఇంటి పైన డబల్ బెడ్ రూంలోకి ఒక కుటుంబం వచ్చింది, వారు లోకల్ ఆఫ్రికన్ నల్లవారు, వచ్చిన మొదటి రోజే నేను గార్డెన్లో మల్లెపూల చెట్టుకి నీళ్లు పడుతుంటే వచ్చి పలకరించింది. వారు ఇంతకుముందు ఎక్కడో సొంత ఇంటి నుండి వచ్చారంట తనకి ఒక్కడే కొడుకనీ, ఆ పిల్లాడి నాన్న ఆక్సిడెంట్లో చనిపోయాక ఆస్తులన్నీ అమ్మి అక్కడనుంచి వచ్చేశాననీ చెప్పింది, ఇంతా చూస్తే ఆ పిల్లకి ఇరవై ఒకటో ఇరవై రెండో ఉంటాయేమో, చాలా చిన్న పిల్ల, ఆ బట్టలూ చిన్నపిల్లల్లానే వేసుకుంది, ప్రతీ పావుగంటకీ బాల్కనీలోకొచ్చి సిగరెట్లు తాగుతుంది, ఆ పిల్లాడి ఏడుపుతో మా ఇల్లు దాంతోపాటు పక్కన రెండుమూడు ఇళ్లు దద్దరిల్లుతున్నాయి, రోజంతా ఏడుపే ఎందుకో, నేను ఆఫీస్ మీటింగుల్లో ఉన్న ప్రతిసారీ అదే వినిపిస్తుంది, ఒకసారి మీటింగులో ఎవరో అడిగారుకూడా మాకు చెప్పకుండానే పిల్లల్ని కన్నవా అని, ఒక్కోసారి పోనీలే ఒంటరి తల్లి అందులో చిన్నపిల్ల తెలిసుండదేమో, నాలాగే అనుభవం లేదు కదా అనుకునే దాన్ని, ఇంకోసారి నిద్ర పట్టనివ్వక, మీటింగుల్లో మాటలు అర్థం కానివ్వకపోతే కోపం వచ్చేది, ఆపుకోలేక ఒకరోజు అడిగేసాను కూడా, ఆ అమ్మాయి సమాధానం కన్నా తానెందుకో తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నట్టు అనిపించింది, ఏడ్చిన గుర్తులు చెంపలమీద స్పష్టంగా కనిపిస్తున్నాయి, ఎరుపెక్కిన కళ్ళు ఏదో తీవ్రమైన బాధని మోస్తున్నాయి. ఏ సమాధానం చెప్పినా అది అబద్ధం అని నాకు తెలుసు, నాకెందుకో ఒక్క క్షణం నా కూతురిలాగా అనిపించింది, చెబితే ఎంత కష్టమైనా ముందుండి తీర్చాలనిపించింది, నాకునేనే చొచ్చుకుపోయి మాట్లాడే స్వభావం కాదు నాది, అందుకే

అనిపించినవన్నీ అడగలేకపోయా, అడిగినవాటికి త్వరత్వరగా ఏదో చెప్పి వెళ్లిపోయింది, చాలా అందమైన కళ్ళు ఆకర్షించే మొఖం సన్నగా మల్లెతీగలాగా ఉంది, నల్ల మల్లె తీగ.

రోజురోజుకీ పిల్లాడి ఏడుపు రెట్టింపవుతుంది, మొన్న వాళ్ళ అమ్మ ఎత్తుకుంటే చూసాను నెలల బాబు, పాలకి ఏడుస్తున్నాడేమో ఏదైనా కడుపునొప్పో ఏమై ఉంటుంది అని నేనే గూగుల్ లో రీసెర్చ్ చేయడం మొదలు పెట్టాను, పిల్లల గురించి, వాళ్ళ సమస్యల గురించి నేను ఎప్పుడూ తెలుసుకోలేదు ఆ అవసరమైనా రాలేదు. ఏడుపు రాత్రంతా వినిపిస్తూనే ఉంది, ఏడుపు వింటూనే పడుకున్నాను.

ఉదయం మూడవుతున్నట్లుంది, పక్షుల అరుపులు కిటికీలోంచి వినిపిస్తున్నాయి వాటితోపాటు ఏవేవో పోలీసు జీబు చప్పుళ్ళు, హారన్ మోతలు చాలా దగ్గరనుంచి వినిపిస్తున్నాయి, మా ఆయన అప్పటికే లేచి బయటకి వెళ్లి అక్కడున్న వాళ్ళతో మాట్లాడుతున్నాడు, అయితే ఇక్కడ ఇళ్ళకి పోలీసులు రావడం సాధారణం, ఇంతకుముందు కూడా ఇంట్లో ఏదో గొడవ పెట్టుకొని పోలీసులకి ఫోన్ చేసిన వాళ్ళు ఉన్నారు, ఆ అనుభవంతో మళ్ళీ అలాంటిదే అనుకోని మంచం దిగకుండా అలాగే ఉన్నాను, ఈ లోపు మా ఆయన వచ్చి పైన ఇంట్లో అమ్మాయి ఏదో మాత్రల్ని మింగి చనిపోయింది, చనిపోయే ముందు పోలీసులకి ఫోన్ చేసిందని చెప్పాడు, ఒక్కసారిగా భూకంపం వచ్చి అమాంతం నేను అందులో జారి పడినట్టు అనిపించింది, చలి కాలంలో కూడా చమటలు పట్టి తలలోంచి ధారగా కారుతున్నాయి. ఈరోజు కూడా చూసాను ఆ అమ్మాయిని, నేనే కలుగజేసుకొని ఇంకా ఎక్కువసార్లు మాట్లాడాల్సింది, లేకపోతే వాళ్ళింటికి వెళ్లి కొంత సమయం గడపాల్సింది, ఇంకా ఏవేవో అనిపించాయి, భయం బాధ అన్నీ ఏకకాలంలో కలిగాయి, నా కూతురులాగా అనుకునాన్నేమో ఇంకొంచెం బాధ కలిగింది, అమ్మ మనసంటే ఇదేనేమో, నాకెప్పుడూ ఇలాంటి అనుభవం లేదు, కన్నీరొచ్చినా మా ఆయనకి తెలియకుండా దాచుకున్నాను. ఇలా అన్నీ దాచుకొని మంచీ చెడూ అన్నీ నాలో నేనే ఉండడం అలవాటు.

ఈలోపు తలుపులు ఎవరో గట్టిగా కొడుతున్న శబ్దంతో నేనే బయటకి వెళ్లి చూసాను, ముదురు నీలంరంగు డ్రెస్ వేసుకొని జేబు పక్కన రివాల్వర్ పెట్టుకొని, జుట్టు ముడేసుకొని చేతిలో బిడ్డని పట్టుకున్న లేడీ పోలీసు నా ముందు నిలబడి ఉంది, ఏంటీ అన్నట్టు చూసాను, నాకెందుకో మాటకూడా పెగలట్లేదు, మాట వస్తే దానితోపాటు ఏడుపొస్తుందేమోనని భయంతో మాట్లాడట్లేదు, ఆవిడే పలకరించి మాట్లాడింది, తెల్లారేదాకా ఆ బిడ్డని మా దగ్గర ఉంచుకోవాలని ఈలోపు దహన సంస్కారాలూ వాళ్ళ ఫార్మాలిటీస్ ఏవో ముగించుకుంటారనీ ఆమె సారాంశం. అప్రయత్నంగా చేతులు ముందుకు చాచాను, ఆ పిల్లాడు నా చూపుడు వేలు పట్టుకున్నాడు, ఆ పోలీసు చిరునవ్వుతో థాంక్స్ అని, బిడ్డని నాకిచ్చి తనపనిలో మునిగి పోయింది, నాకేమీ అర్ధం కాలేదు, ఆవిడ అడిగినప్పుడు నేను ఒప్పుకున్నానా లేదా కూడా నాకు అర్ధం అవ్వలేదు, నా చేతులు ఎందుకో వణుకుతున్నాయి, బిడ్డ మొఖం వైపు చూడాలంటే భయమేసింది, పోలీసు వాళ్ళు పాలు తాగించినట్టు ఉన్నారు, ఏడవకుండా ఆడుకుంటున్నాడు, ఉన్న నా కొంచెం జుట్టు పీకుతున్నాడు, తెలుస్తుంది అయినా బిడ్డ మొఖం చూడకుండా ఎత్తుకొని అలాగే గుమ్మంలో నిలబడ్డా, అప్పుడే ఇద్దరు మగ పోలీసులు ఒకళ్ళు చేతుల్ని తలతో కలిపి పట్టుకొని, ఇంకొకళ్ళు కాళ్లు పట్టుకొని ఆ అమ్మాయిని కిందకి మోసుకొస్తున్నారు, ఎందుకో నాకు శవం అనాలనిపించలేదు, ఆ అమ్మాయి ఇంకా నవ్వుతూనే ఉన్నట్టుంది, అంతే అందమైన మొఖం ఎలా వచ్చిందో అలాగే వెళ్లిపోయింది.

బిడ్డని ఇంట్లోకి తీసుకెళ్లి పాలు కాచి తాపించాను, ఎప్పుడు మూడు గంటలవుతాయా ఎప్పుడు పోలీసులొచ్చి తీసుకెళ్తారా అని ఎదురు చూసాను, ఎందుకో నాకు భయంగా బాధగా ఉంది, నాకు పిల్లలు లేరు, కుక్కలాగా రామచిలుక లాగా ఈ బిడ్డని కూడా నేను ఏమైనా చేస్తానేమో అని నా భయం, నాకు పిల్లలు పుట్టలేదుగా అందుకే నాకు పిల్లల్ని చూసుకోవడం రాదు. ఆ పిల్లాడు చక్కగా నవ్వుతున్నాడు ధైర్యంచేసి మొఖం చూసాను, వాళ్ళమ్మలాగే అందమైన మొఖం చక్కని కళ్ళు, ఆ నవ్వు చూస్తూ ఉండిపోవచ్చు, ఎందుకు చనిపోయిందో ఆ పిచ్చితల్లి. ఎందుకో వాడికి దగ్గరగా జరగాలనిపించింది, వాడి చేతులోకి నా చూపుడు వేలు దూర్చి వాడే నా వేలు పట్టుకున్నాడని

మురిసిపోయాను, ఈలోగా మా ఆయన కూడా పిల్లాడితో ఆడుకొని ఆఫీస్ కి వెళ్ళాడు, పోలీసులు ఇచ్చిన నెంబర్ కి కాల్ చేస్తే ఇంకో నాలుగయిదు గంటలైనా పడుతుందని, క్షమించాలని కోరారు, చేసేదేమీ లేక ఆఫీసుకి సెలవుపెట్టి వాడికి స్నానం చేయించి వేద్దామంటే బట్టలు లేకపోతే తెలిసినవాళ్ళకి ఫోన్ చేసి ఈ కథంతా చెప్పి బట్టలు తెప్పించి వేసాను, అవి కొంచెం ఒదులయ్యాయేమో ఊరికే జారిపోతున్నాయి. నాకు అంత పసిపిల్లలకు స్నానం చేయించడం బట్టలేయడం రాదు, ఎప్పుడూ చేయలేదు, యూట్యూబ్ లో వీడియోస్ పెట్టుకొని అన్ని పనులూ చేసాను, వాళ్ళ అమ్మ ఉన్నా ఇన్ని పనులు ఇంత గొప్పగా చేయలేదేమో, నాకు పిల్లల్ని చూసుకోవడం వచ్చు అని నాకు నేనే నిరూపించుకోవాలని నేర్చుకొని మరీ చేసాను, ఒక్కసారంటే ఒకసారికూడా పిల్లాడ్ని ఏడవనివ్వలేదు, ఎందుకంటే వాడు ఏడిస్తే నాకు వాళ్ళ అమ్మ గుర్తొస్తుంది, అసలు వీడి పేరేంటో, వాళ్ళమ్మ ఏమని పిలిచేదో వాడికీ నాకూ ఇద్దరికీ తెలియదు.

పోలీసులకి ఫోన్ చేయడం వాళ్ళు ఇంకో గంటో, రెండు గంటలో అంటే బాగుండు అనుకోవడం, యాదృచ్ఛికంగా వాళ్ళు అలాగే అనడంతో గంటలు రోజులయ్యాయి, ఇప్పటికి మూడు రోజులు గడిసింది, ఏదైతే అదైందని ఆఫీసుకు ఈ మూడు రోజులూ సెలవుపెట్టాను, ఈ మూడురోజులే నా జీవితంలో ఎక్కువ సంతోషంగా ఉన్నది. ఎందుకో తెలియదు నా బిడ్డ కాదు, నా శరీర రంగు కూడా కాదు, నాదగ్గర ఉండడనీ తెలుసు అయినా ఏదో బంధం నన్ను పట్టి వదలట్లేదు, నాకు తెలియకుండానే సంతోషంగా ఉంటున్నాను, వాడు నవ్వుతుంటే నా ప్రాణం లేచొచ్చినట్టుంది. వాడు ఏడుద్దామనుకునేలోపే నేను అమ్మనవుతున్నాను, బిడ్డ ఏడిస్తే అమ్మ ఉరుకోదుగా. మూడు రోజుల తరువాత పోలీసులొచ్చి వాడిని తీసుకెళ్తుంటే చెప్పలేనంత బాధ, ఎప్పటిలాగే నేనొక్కదాన్నే బాధనంతా అనుభవించాను, ఆరోజు ఉదయం వాళ్ళు తీసుకెళ్తే సాయంత్రందాకా ఏమీ తినాలనిపించలేదు, అలాగే ఒకేదగ్గర కూర్చొని ఉన్నా, మనసులోపలా బయటా ఏ చలనమూ లేకుండా అలాగే ఉండిపోయాను, ఏదో బాధ రెప్పలు దాటి రావడానికి సిద్ధంగా ఉంది, నేను మోయలేదు కనలేదు పెంచనూ లేదు, మూడు రోజులకేనా ఇంత బాధ, దీన్ని వర్ణించడం కూడా నాకు రాదు, బాధని అనుభవించడం కూడా రావట్లేదు, అందుకే మొటిసారి మనసు విప్పి మా ఆయనతో 'ఆ బిడ్డని ఎలాగైనా మనం పెంచుకుందామండీ' అన్నాను. ఎందుకో తెలియదు నన్ను గట్టిగా కౌగిలించుకొని ఆయన ఏడ్చాడు, నా భుజంమీద నుంచీ ఆయన కన్నీరు జారుతున్న స్పర్శ నాకు తెలిసింది.

ఎంతో మందిని కలిసి వేడుకున్నాక, ఎన్నో సంతకాలు షూరిటీలు చేసాక, పదిరోజులు ఇదే పనిగా పోలీసు స్టేషన్లు, కోర్టులు, చైల్డ్ వెల్ఫేయిర్ ఆఫీసులు అన్నీ తిరిగాక ఒకరోజు కోర్టు అనుమతితో వాడిని మా ఇంటికి తెచ్చుకున్నాం, నాకెందుకో వీడ్ని నేనే కన్నానేమో అనిపించింది, వీడు ఇప్పటినుంచీ నా బిడ్డ, కడుపున పుట్టకుండా నన్ను యశోదని చేసిన నల్లని కృష్ణుడు, వీడికి ఏదైనా మంచి తెలుగు పేరు పెట్టాలి, రేపటినుంచీ ఉద్యోగం మానెయ్యాలి, వీళ్ళ అమ్మ కోసమైనా ఏడవనీయకుండా పెంచాలి. ఇప్పుడు మా ఇంట్లో మల్లెపూలు నల్ల రంగులో పూస్తున్నాయి.

Post your comments